# వైఎస్ఆర్ కడప వార్త



తెలుగు జాతీయ దినపత్రిక

శుక్రవారం 24 ఏప్రిల్ 2026


## సీబీఎస్ఈ ఫలితాల్లో శాన్వీ 100 శాతం ఫలితాలు

రాజంపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



అన్నమయ్య జన్మస్థలి తాళ్ల పాక రహదారిలో ఏర్పాటు చేసిన సాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సీబీఎస్ఈలో కొత్త మైలురాయి సాధించింది. 2026 బ్యాచ్‌కు 100 ఫలితాలు రావడం గర్వ కారణంగా ఉందని కరస్పాండెంట్ కే. శరత్ కుమార్ రాజు పేర్కొన్నారు. గురువారంసాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా సీబీఎస్ఈ ఫలితాల్లో అత్యంత మార్కులు సాధించి బంగారు పతకం సాధించిన గోల్డ్ మెడలిస్ట్ జి. రిషిత, సిల్వర్ మెడలిస్ట్: ఎస్. కుసుమ గీతాంజలి, బ్రోంజ్ మెడలిస్ట్: సి. సుప్రజ సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కొండూరు శరత్ కుమార్ రాజు,సీఈఓ శ్రీ శంకర్ రాజు,డైరెక్టర్ కొండూరు భరత్ కుమార్ రాజు,ప్రిన్సిపాల్ మడుగు ప్రభాకర్ పాల్గొన్నారు. అత్యంత పార్కు సాధించిన వారికి మెడల్స్ తో పాటు సన్మానించారు.

## ముగిసిన జగన్ పులివెందుల పర్యటన

పులివెందుల ఏప్రిల్ 23, ప్రభాత వార్త :



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మూడు రోజుల పులివెందుల పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం బెంగళూరు నుంచి పులివెందులకు చేరుకున్న ఆయన, తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా విన్నారు. బుధవారం లింగాల మండలం ఇప్పట్ల గ్రామానికి వెళ్లిన జగన్, వైసీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పులివెందులలో మరోసారి ప్రజా దర్బార్ నిర్వహించి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ వారికి భరోసా కల్పించారు. గురువారం ఉదయం సుమారు 8.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా 4వ పేజీలో

### మొబైల్ అందం, సెల్ఫీ కోసమే కాదు

# మహిళల రక్షణకు బ్రహ్మాస్త్రం





మహిళలకు పోలీస్ రక్షణపై సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు, పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

మొబైల్ మహిళలకు తమ అందం చూసుకునేందుకు, సెల్ఫీ తీసుకునేందుకే కాదని రక్షణ కోసం బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడుతుందని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు తిరుగులేని రక్షణగా మొబైల్ ఉంటుందని గుర్తు చేశారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మొబైల్ ద్వారా ప్రతి ఒక్కరు సద్వినియోగం తీసుకొని రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వజ్రం కళ్యాణ మండపంలో పోలీస్ శాఖ ద్వారా శక్తి యాప్ పై మహిళల్లో చైతన్యవంతం చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగన్మోహన్ రాజు మాట్లాడుతూ అన్ని రంగాలలో దూసుకుపోతున్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్ ద్వారా తిరుగులేని భద్రత కల్పిస్తోందని అన్నారు. ఇంటా,బయట మహిళల కు శక్తి యాప్ ఎంతో భద్రతనిస్తుందన్నారు. పోలీసుల సలహాలు సూచనలు పాటించి రక్షణ పొందాలన్నారు. గడప దాటితే మహిళకు తిరుగు లేదన్నారు. మహిళలు స్వేచ్ఛగా బయటకు రావాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ యాప్ ద్వారా మహిళలను చైతన్యవంతం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2004లో డ్వాక్రా మహిళల ఆర్థిక శక్తి ఏంటో ప్రపంచానికి చెప్పారన్నారు. పురుషులు వెళితే బ్యాంకు ఏంషూరిటీ పెడతారని అడుగుతారని, అదే డ్వాక్రా మహిళలు బ్యాంకుకు వెళితే కేవలం ఆధార్ కార్డు తీసుకువెళ్తే లక్ష నుంచి రెండు మూడు లక్షల వరకు కూడా రుణం ఎలాంటి షూరిటీ లేకుండా రుణంలభిస్తుందని పేర్కొన్నారు .మహిళల సత్తా అంటే ఇదేనన్నారు. ఆర్థిక క్రమశిక్షణ వల్లే డ్వాక్రా మహిళలకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని వెల్లడించారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించారని గడప దాటడం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు .ఇప్పుడు స్వేచ్ఛగా గడప దాటేందుకు శక్తి యాప్ ఉందనీ గుర్తు చేశారు. చదువుకునే పిల్లలు కూడా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. కడప దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాంతమ్మ మాట్లాడుతూ కళాశాలకు ,పాఠశాలకు వెళ్లే బాలికలు ఎలాంటి ఆపద వచ్చినా 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేస్తే తక్షణ సహాయం లభిస్తుందన్నారు. పిల్లల రక్షణ కోసం 1098 నెంబర్ కు ఫోన్ చేయాలన్నారు .మహిళలకు ఎలాంటి గృహ సమస్యలున్న 1098 వరకు కాల్ చేయాలన్నారు. మహిళల వేధింపులకు 1091 కు ఫోన్ చేస్తే తక్షణ సహాయం లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కడప దిశ పోలీస్ స్టేషన్ సిఐ ఎల్లంరాజు, అర్బన్ సీఐ నాగార్జున ,ఎస్సై వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, ఇడిమడకల కుమార్, మనుబోలు వెంకటేశ్వర్లు, మంద శ్రీనివాసులు ,తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని 6వ తరగతి విద్యార్థి మృతి

తొండూరు ఏప్రిల్ 23ప్రభాతవార్త:





తొండూరు గ్రామంలో బస్ స్టాప్ వద్ద గురువారం ఎండాకాలం సెలవులు కావడంతో తొండూరు బీసీ హాస్టల్‌లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న డి .గురు ప్రణీత్ 13 సంవత్సరాల విద్యార్థి తన సొంత గ్రామమైన వేంపల్లికి వెళుతుండగా తొండూరు బస్ స్టాప్ వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొని కాళ్లు నుజ్జు నుజ్జు కావడంతో అతన్ని వెంటనే 108 ద్వారా పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది. అక్కడనుండి కడప రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. కడప నుండి మెరుగైన చికిత్స కోసం ఏలూరు హాస్పిటల్ కి తరలిస్తూ ఉండగా మార్గమధ్యంలో విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి తొండూరు ఎస్సై గణ మద్దిలేటి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒక గంటలో ఇంటికి చేరుకుంటాడన్న తమ కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు బోరు బోరున విలపిస్తూ నీకు అప్పుడే నూరేళ్లు నిండిపోయాయి అంటూ అక్కడ ఉన్న ప్రజానీకం కంటతడి పెట్టారు.

## విద్యార్థి కుటుంబానికి అండగా ఉంటాం : మంత్రి

కడప ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో తొండూరు బీసీ హాస్టల్ కు చెందిన విద్యార్థి దుర్మరణం పాలవ్వడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో ఉజ్వల భవిష్యతు కలిగిన విద్యార్థి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థి పసి ప్రాయంలోనే మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. తల్లి, అన్నయ్య కళ్లెదుటే ఘోరం జరగడం మరింత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. విద్యార్థి మృతదేహానికి పోస్టు మార్టం చేయించి, బాధిత కుటుంబానికి వెన్నంటే ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను మంత్రి సవిత ఆదేశించారు. వేసవి సెలవులకు ఇళ్లకు వెళుతున్న విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల వెంటే హాస్టళ్ల నుంచి బయటకు వెళ్లాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా జాగ్రత్తగా ఉండాలని, బస్సులు, ఇతర వాహనాలు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవి సెలవుల్లోనూ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. హాస్టళ్ల సిబ్బంది కూడా విద్యార్థుల పట్ల కన్నేసి ఉంచాలని, తల్లిదండ్రులతోనే ఇళ్లకు పంపాలని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# జలదార కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టండి..





కడప, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జలదార కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి జలాధార అమలు, 22ఏ, రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, డిజిటల్ రెవెన్యూ రిజిస్ట్రీ, స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్,తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల కార్యదర్శులు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు జేసీ డా. నిధి మీనా, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జలదార కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ఎటువంటి లోపాలు లేకుండా డ్వామా, జల వనరుల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమ నిర్వహణలో మండల, గ్రామ స్థాయి అధికారులు నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళికను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచిస్తూ, బాధ్యతాయుతమైన పనితీరును కనబరచాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జి డిఆర్వో.వెంకటపతి, సీపీవో హాజరతయ్య, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్ సమీ, డ్వామా పీడి అదిశేషారెడ్డి, ఆర్ డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడుకొండలు,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ ఫోరం సద్వినియోగం చేసుకోవాలి..

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించడం కోసం టౌన్ ప్లానింగ్ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయడం టౌన్ ప్లానింగ్ విభాగం ఓపెన్ ఫోరం ముఖ్య ఉద్దేశమని కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ (నీతిది) కూచిపూడి రాకేష్ చంద్ర అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ విభాగం ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. సిటీ ప్లానర్, ఇతర టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డ్ ప్లానింగ్ మరియు రెగ్యులేషన్ సెక్రటరీలు, పట్టణ ప్రణాళికా శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రస్తుత పనులు, అనుమతుల ప్రక్రియ, పెండింగ్ దరఖాస్తులు, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు వంటి అంశాలపై చర్చించి, తగిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ ఓపెన్ ఫోరమ్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డ్ ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలు, అలాగే లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్ టి పి)లు ప్రత్యక్షంగా పాల్గొని ప్రజలకు అవసరమైన సమాచారం అందించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు చెప్పుకునే అవకాశం కలిగింది. భవన నిర్మాణ అనుమతులు (డి పి ఎం ఎస్), బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ (బి పి ఎస్), లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ ఆర్ ఎస్), ట్రాన్స్ స్ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టి డి ఆర్)లకు సంబంధించిన అనుమతులు, పెండింగ్ ఫైళ్లు, సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉన్న ప్రజలు ఈ ఓపెన్ ఫోరమ్‌కు హాజరై తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి తక్షణ పరిష్కారం పొందవచ్చని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నీరు ,గాలితో చిల్లర రాజకీయాలు తగదు

పులివెందుల ఏప్రిల్ 23 ప్రభాత వార్త :

నియోజక వర్గంలోనీ లింగాల మండలంలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ అత్యంత నిరక్ష్యంగా, అసమర్థంగా జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు తమ గోడును మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి రైతులతో కలిసి పట్టణంలోని మినీ సచివాలయ సముదాయంలోని లింగాల కుడి కాలువ ఇరిగేషన్ కార్యాలయానికి చేరుకొని అధికారులతో ఎత్తిపోతల పథకాల నిర్వహణపై ఆరా తీశారు. అయితే అధికారులు సమస్యలపై సరైన స్పందన చూపకుండా నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీ మండి పడ్డారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మరోవైపు నారా చంద్రబాబు నాయుడు సభల్లో లింగాల మండలాన్ని అరటి సాగులో ముందున్న ప్రాంతంగా పేర్కొంటున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని పేర్కొన్నారు. నీరు అందక పంటలు ఎండిపో తుండగా, రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని తెలిపారు. కోమన్నూతల, దిగుపపల్లి, అంబక పల్లి, ఎగువపల్లి, రాముట్లపల్లి తదితరంగా 18 గ్రామాలకు సాగు నీరు అందక రైతులు 1000 నుంచి 2000 అడుగుల లోతులో కొత్త బోర్లు వేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఉన్న బోర్లను మరింత లోతుగా మార్చడానికి రైతులు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. మరోవైపు అరటి పంటకు సరైన ధరలు లేక రైతులు ఆర్థికంగా కుదేలవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్రావతి రిజర్వాయర్‌లో 10 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ వాటిని వినియోగించడంలో అధికారులు విఫలమవు తున్నారని విమర్శించారు. లింగాల కుడి కాలువ పరిధిలో మొత్తం 70 బోర్లు ఉండగా, కేవలం 46 మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలినవి మరమ్మత్తుల కోసం నిలిచిపోయాయని తెలిపారు. వెలిదండ్ల వద్ద ఐదు, కుంట వద్ద నాలుగు, తాతిరెడ్డిపల్లె వద్ద మూడు బోర్లు సక్రమంగా పనిచేస్తే అన్ని గ్రామాలకు నీరు అందుతుందని పేర్కొన్నారు. రిపేరు ఆయన బోర్లు మరమ్మత్తులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, తాము చేయాలంటే అధికార పార్టీ నాయకుల అనుమతులు కావాలని చెప్పడం బాధాకరమని ఆయన అన్నారు. నీటి సమస్యపై రాజకీయాలు చేయడం తగదని, రైతులను మానవత్వంతో ఆదుకోవాలని సూచించారు. లింగాల మండలంలో 5:4:3 విధానంలో బోర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారు లను కోరామని, వచ్చే గురువారం నాటికి మోటార్లు పనిచేసేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.అలాగే వేముల మండలంలోని భూమ య్యపల్లి, రాచకుం టపల్లి, కొట్టాల గ్రామాల్లో గతంలో అందించిన కృష్ణా జలాల సరఫరా ప్రస్తుతం నిలిచిపోయిందని, అక్కడి మోటార్లు కూడా పనిచేయక పోవడం అధికారుల నిరక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.మే 1లోపు అన్ని బోర్లు, మోటార్లను మరమ్మత్తు చేసి సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి ఆందోళనకు దిగుతామని నాయకులు హెచ్చరించారు. ఎత్తిపోతల పథకాలన్నీ సక్రమంగా నడిచేలా చర్యలు తీసుకుని, రైతులకు సాగునీరు, తాగునీరు అందించాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎస్వి సతీష్ కుమార్ రెడ్డి, నాగెల్ల సాంబ శివారెడ్డి, జెడ్పిటిసి బయపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్వాములూ ఇదేమి పద్ధతి...

### పులివెందులకు వెళ్లి వేద ఆశీర్వచనమా

### ఒంటిమిట్ట కోదండ రామాలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు

రాజంపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించే ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పనిచేసే టిటిడి అర్చకులు కొత్త సంస్కృతికి నాంది పలికారు. బ్రహ్మోత్సవాలకు ముందు టీటీడీ తరఫున ఈవో, చైర్మన్ లేదా వేద పండితులు వెళ్లి ముఖ్యమంత్రి కి సాంప్రదాయబద్ధంగా ఆహ్వాన పత్రిక అందజేసి ప్రసాదం అందజేయడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఎప్పుడూ టిటిడి ఎక్కడికీ వెళ్లి వేద ఆశీర్వచనం ,ప్రసాదాన్ని అందజేసే సంస్కృతి లేదు. కొత్త సాంప్రదాయానికి ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పనిచేసే అర్చకులు తెరలేపారు. జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం పులివెందుల కు వెళ్లి అక్కడ టిటిడి ప్రసాదం అందజేసి,వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వం,టిటిడి పాలకమండలి దృష్టికి వెళ్ళింది.టీటీడీ ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా అర్చకుల అత్యుత్సాహం ప్రవచించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి.పులివెందులకు వెళ్లి జగన్‌కు వేద ఆశీర్వచనంతో పాటు, శేష వస్త్రం, రాములోరి తోమాల, ముత్యాల తలంబ్రాలు ఒంటిమిట్ట ఆలయ అర్చకులు అందజేయడంపై టిటిడి సీరియస్ గా పరిగణించింది. వైఎస్ జగన్ సేవలో తరించిన ఒంటిమిట్ట కోదండ రామాలయ అర్చకులు ఎ.శ్రావణ్‌కుమార్, వీణా మనోజ్‌కుమార్, కె.పార్థసారథికి గురువారం ఉప కార్యనిర్వహణాధికారి ఎ.ప్రశాంతి షోకాజ్ నోటీసులు జారీ చేసి రెండు రోజుల్లో సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు. కాగా ఇదే అర్చకులు మరికొందరు కలిసి కూడా రాజంపేటలో ఇద్దరు నేతలకు కూడా ఇదే విధంగా వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రం ప్రసాదం అందజేశారు.



పులివెందులలో జగన్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న టిటిడి అర్చకులు

### ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు

## క్రమశిక్షణ, నైతిక విలువలు అవసరం



వేంపల్లి:ఏప్రిల్ 23 ప్రభాతవార్త

ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సంస్కారం ఎంతో అవసరమని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసి రెడ్డితెలిపారు స్థానిక నారాయణ కాలేజీ పాఠశాలలో గురువారం నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డిఆధ్వర్యం లో కాన్వొకేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ అన్ని సంపదలో కెల్లా విద్యా సంపద ప్రధానమైనదని,ఆ సంపదను తమ బిడ్డలకు అందించవలసిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉందని అన్నారు.విద్యాసంస్థల యాజమాన్యాలు,ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన,సంస్కారవంతమైన ,నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని అన్నారు. మానవ జీవితంలో విద్యార్థి దశ స్వర్ణ యుగము లాంటిదని, ఈ దశను ఏ విద్యార్థి అయితే సద్వినియోగం చేసుకుంటాడో అతడు కచ్చితంగా జీవితంలో రాణిస్తాడని తులసి రెడ్డి అన్నారు. నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ఆధునిక సదుపాయాలతో పాటు విలువల ఆధారిత విద్యను అందిస్తున్నాయని, భవిష్యత్తులో మరింత మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటరామిరెడ్డి. తల్లిదండ్రులు, విద్యార్థులు, నారాయణ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి

దువ్వూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

మండల పరిధిలోని దాసరి పల్లె గ్రామంలో పొలం గట్టు విషయంపై మంగళవారం జరిగిన ఘర్షణలో గాయపడ్డ మొలకల శ్రీనివాసులు(53) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. దాసరిపల్లె గ్రామంలో మంగళవారం రోజున పొలం గట్టు విషయంపై ఆంజనేయులు, లక్ష్మీనారాయణ వర్గీయుల మధ్య వాదులాట జరిగి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మొలకల శ్రీనివాసులుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కొరకు కడప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా ఉండటంతో బుధవారం సాయంత్రం బెంగళూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మొలకల శ్రీనివాసులు మృతి చెందినట్లు దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. బెంగుళూరు ఆసుపత్రి 4వ పేజీలో

# డీలర్ల నెల వారి సమావేశము



సుండుపల్లి ఏప్రిల్ 23 ప్రభాతవార్త

మండల పరిధిలోని తాసిల్దార్ కార్యాలయంలో నందు తాసిల్దార్ లక్ష్మమ్మ అధ్యక్షతన 23వ తేదీ డీలర్ల సమావేశము ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ మండలంలోని అన్ని చౌక దుకాణపు డీలర్లు ప్రతినెల 26వ తారీఖున 65 సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు, వికలాంగులకు, మంచానికి పరిమితమైన దీర్ఘకాల కాలిక వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు తెలియజేసారు. ఎన్ఫోర్స్మెంట్ డీటీ రవికుమార్ మాట్లాడుతూ 26వ తారీఖున పంపకం చేస్తున్నటువంటి బియ్యము చక్కర మొదలగు నిత్యావసర వస్తువులు వయోవృద్ధులకు వికలాంగులకు మంచాన పడిన బాధితులకే కాకుండా మిగతావారికికూడఇస్తున్నారు అలాఇవ్వకూడదు అలా పంపిణీ చేసినట్లయితే వారి పైన చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామని తెలియజేయడమైనది. అంతేకాకుండా ఒకటో తేదీ నుంచి పంపకం చేస్తున్నటువంటి నిత్యవసర సరుకులు సక్రమంగా డీలర్లు పంపిణీ చేయాలని అలాగే ఎండలు ఎక్కువగా ఉన్నందువలన షాపు దగ్గర మంచినీళ్లు ఏర్పాటు చేయాలని అలాగే ఎండలు తప్పించి సరుకులు పంపిణీ చేయాలని తెలియజేసారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వినీత్ కుమార్ రెడ్డి,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ జ్యోతిర్మయి, రేషన్ డీలర్ల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్జల్ డీలర్లు పాల్గొన్నారు.

## వైస్సార్సీపీ నేత బోవిళ్ల చిన్న సూరారెడ్డి పరామర్శ



బద్వేలు అర్బన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

బద్వేల్ నియోజకవర్గం అట్లూరు మండలానికి చెందిన వైస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోవిళ్ల చిన్న సూరారెడ్డి కంటి శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దేరుంగుల లక్షుమయ్య, ఓబుల్ రెడ్డి, రాజారెడ్డి, గోపాలయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సగర కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

తొండూరు ఏప్రిల్23 ప్రభాతవార్త:

స్థానిక తొండూరు మండలంలోని బూచుపల్లి గ్రామం బీసీ కాలనీ రామాలయం నందు సగర యువసేన రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జనార్ధన్ ఆధ్వర్యంలో సగర కుల గురువు శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి నిర్వహించారు అనంతరం జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సగర/ఉప్పర కులస్తులు 15 లక్షల పైగా ఉన్నారని కానీ రాజకీయంగా ఎటువంటి ప్రాధాన్యత లేదు 2014లో చంద్రబాబు నాయుడు సగరుకులస్తులకు అనేక హామీలు ఇచ్చి గాలికి వదిలేసారు బీసీ .డీ నుంచి బీసీ. ఏ కి మారుస్తామని భవన నిర్మాణ రంగంలో సగర్ల అధికంగా ఉన్నారని వారికి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చారు మళ్లీ 2024 ఎలక్షన్ లో కూడా కూటమితో జతకట్టి సగర కులస్తులకు మభ్యపెట్టే మాటలు చెప్పి అధికారం లోకి వచ్చారు సగర కులస్తులకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారు వీటన్నిటిని ఇప్పుడు మరిచారు కావున భగీరథుని స్ఫూర్తితో సగర హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆంజనేయులు చెన్నకేశవులు మహేష్ విష్ణువర్ధన్ మహిళలు సరోజ పార్వతి భవాని తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ నమోదు మనందరి బాధ్యత

వైవీయూ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



గృహ, జనగణన స్వీయ నమోదు ప్రతి కుటుంబం చేసుకోవాలని జనగణన మాస్టర్ ట్రైనర్లు, వైవియు ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని సురభి సమావేశ మందిరంలో కామర్స్ శాఖ విభాగాధిపతి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో గృహ, జనగణన స్వీయ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య శ్రీనివాసులు మాట్లాడుతూ తొలుత se.census.gov.in అధికారిక వెబ్ సైట్లో లాగిన్ ప్రక్రియ భాగంగా రాష్ట్రం, క్యాప్చా నమోదు చేసి వెరిఫై చేయాలి. అనంతరం యజమాని పేరు, ఫోన్ నంబరు, ఈమెయిల్ ఐడీ నమోదు చేస్తే ఫోన్కు ఆరు అంకెల సందేశం వస్తుంది. వీటిని నమోదు చేసిన అనంతరం ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. శాటిలైట్ మ్యాప్ కనిపిస్తూనే.. చిరునామా, పిన్కోడ్ నమోదు చేయమని అడుగుతుంది. మనమిచ్చే సమాచారం. ఆధారంగా అక్షాంశాలు, రేఖాంశాల వివరాలను తీసుకుని.. ఇంటిని మ్యాపులో నమోదు చేస్తుంది. అనంతరం ప్రశ్నావళి మొదలవుతుంది. పోర్టల్లో తెలుగు సహా అన్ని ప్రాంతీయ భాషల్లో వివరాలు నింపే సౌకర్యం కల్పించారని తెలిపారు. నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆచార్య రఘునాథరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ విభాగ డీన్ ప్రొఫెసర్ గంగయ్య, ప్రొఫెసర్ విజయభారతి, పొలిటికల్ సైన్స్ హెచ్ఓడి ప్రమీల మార్గరెట్, డాక్టర్ సతీష్‌బాబు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



నందలూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అరవపల్లెలోని బచ్చు భవన్‌లో "ఒక యోగి ఆత్మకథ" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయ భాస్కరరావు ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విలువైన జ్ఞానం పొందడంతో పాటు వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. డిజిటల్ యుగంలో పుస్తక పఠనం తగ్గిపోవడం ఆందోళనకరమని, ప్రతి ఒక్కరూ మంచి పుస్తకాలను చదివే అలవాటు అలవరచుకోవాలని సూచించారు. ఎస్సై మన్నెం రామమోహన్ మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలని, వాటి ద్వారా మానవీయ విలువలు పెంపొందుతాయని అన్నారు. "ఒక యోగి ఆత్మకథ" వంటి ప్రేరణాత్మక గ్రంథాలు యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. భగీరథ జయంతి సందర్భంగా వాకర్స్ క్లబ్ తరఫున నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు భూశెట్టి వెంకటసుబ్బయ్య, మోడపోతుల రాము, గంధం గంగాధర్, మంటి మారయ్య, పాలకుర్తి వెంకటయ్య, పొనబోయిన శ్రీకాంత్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యలు పరిష్కారం



నందలూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

నందలూరు రైల్వే అండర్ బ్రిడ్జిలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. రైల్వే కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి రైల్వే గతి శక్తి ప్రతినిధులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. అండర్ బ్రిడ్జిలో పాదాచారుల కోసం ఫుట్‌పాత్ ఏర్పాటు, వాటర్ లీకేజీ నివారణ, ఫ్లోరింగ్ మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. దీనికి స్పందించిన రైల్వే గతి శక్తి ప్రతినిధులు రెండు రోజుల్లో మరమ్మతులు ప్రారంభించి, పాదాచారుల కోసం ఫుట్‌పాత్ నిర్మాణం చేపడతామని తెలిపారు. అండర్ బ్రిడ్జి మార్గాన్ని లోపాలు లేకుండా సరిచేసి ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సమస్యలపై వెంటనే స్పందించిన రైల్వే డివిజనల్ అధికారులకు రాచూరి మురళి కృతజ్ఞతలు తెలిపారు.

## వాహనం అదుపుతప్పి డ్రైవర్ కు గాయాలు

ముద్దనూరు,ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఉమారెడ్డి పల్లె సర్కిల్ సమీపంలో జమ్మలమడుగు వైపు నుంచి ముద్దనూరు వైపు వస్తున్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఐచర్ వాహనానికి గేదలు అడ్డు రావడంతో అదుపుతప్పి కంపచెట్లల్లోకి దూసుకెల్లడంతో డ్రైవర్ సురేంద్ర యాదవ్ కు స్వల్ప గాయాలు అవడంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనానికి సమాచారం ఇవ్వగా సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

## ప్రభుత్వ స్థలంలో అక్రమ విగ్రహాలు తొలగించాలని వినతి



ముద్దనూరు,ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ముద్దనూరు,జమ్మలమడుగు ప్రధాన జాతీయ రహదారి ఘాట్ రోడ్డు సమీపాన రహదారికి ఇరువైపులా ఉన్న ఏసుక్రీస్తు సిలువ విగ్రహాలు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేశారా, అనుమతులు పొంది ఏర్పాటు చేశారా అని రెవెన్యూ అధికారులు పరిశీలించి అనుమతులు లేకుంటే తొలగించాలని గురువారం నాడు హిందూ చైతన్య వేదిక జిల్లా కన్వీనర్ నరేష్ కుమార్ రెడ్డి మండల తాసిల్దార్ కార్యాలయ భవనంలో ఇంచార్జ్ ఆర్ ఐ రాజ శేఖర్ నాయుడు కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు.

## కాలం చెల్లిన ఉత్పత్తుల విక్రయిస్తే కఠిన చర్యలు



ముద్దనూరు,ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఎరువు పురుగుమందుల దుకాణదారులు కాలం చెల్లిన ఉత్పత్తులను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం నాడు మండలంలోని ఎరువులు పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించి వ్యవసాయ శాఖ అనుమతి పొందిన వస్తువులనే రైతులకు విక్రయించాలని విక్రయించిన ప్రతి వస్తువుకు నగదు రసీదు రైతులకు ఇవ్వాలని సూచించారు. దుకాణదారులు ఎరువుల ధరలను కనిపించే విధంగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అధిక రేట్లకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుకాణాల యజమానులు, అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉద్యోగాలకు భారీ స్థాయిలో హాజరైన అభ్యర్థులు

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 23 ప్రభాతవార్త :

అంగన్వాడీ ఉద్యోగాల కోసం భారీగా అభ్యర్థులు హాజరై పోటీ వాతావరణం నెలకొంది. జిల్లా మహిళా శిశు సంక్షేమ మరియు సాధికారిత శాఖ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.జిల్లాలోని వివిధ సమగ్ర శిశు అభివృద్ధి కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న 30 అంగన్వాడీ కార్యకర్తల పోస్టులు మరియు 141 అంగన్వాడీ సహాయకురాళ్ల పోస్టుల కోసం బద్వేల్, జమ్మలమడుగు, పులివెందుల, కడప రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించబడ్డాయి.అంగన్వాడీ కార్యకర్తల 30 పోస్టులకు గాను 70 మంది అభ్యర్థులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించగా, అంగన్వాడీ సహాయకురాళ్ల 141 పోస్టులకు గాను 177 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో అంగన్వాడీ ఉద్యోగాలపై ఉన్న ఆసక్తి స్పష్టంగా కనిపించింది.

## గిరిజన కాలనీలో సేవా కార్యక్రమం

పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 23 ప్రభాత వార్త :

పోరుమామిళ్ళ మండల పరిధిలోని రామాయపల్లి గిరిజన కాలనీలో గురువారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన 70 మంది చిన్నారులు, పెద్దలకు చెప్పులు, సబ్బులు, టూత్ బ్రష్, టూత్ పేస్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై గిరిజనులకు అవగాహన కల్పించారు. దాతల సహకారంతో పేదలకు తమ సంస్థ నిరంతరం అండగా నిలుస్తుందని తెలిపారు.సంస్థ గౌరవ సలహాదారు రాజోలి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ..సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలంటే పిల్లలను బాగా చదివించాలని సూచించారు. విద్యార్థుల చదువుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులకు స్వీట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కుందారపు గురుమూర్తి, కర్నాటి మద్దిరెడ్డి, సునీల్ కుమార్, జయరాం, హరి తదితరులు పాల్గొన్నారు.



# మండల వాసులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఒంటిమిట్ట ఏప్రిల్.23. ప్రభాతవార్త



మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిప్యూటీ డైరెక్టర్ టి.రామనాథరావు ఎన్‌విబిడిసిపి ఆంధ్ర ప్రదేశ్ మంగళగిరి విజయవాడ తనిఖీ చేయడం జరిగింది. ముందుగా సర్వజన వైద్యశాల పరిసరాలను, టాయిలెట్లను ,మందుల పంపిణీ రూము, రోగుల రూము, ఆపరేషన్ రూము, పరిశీలించారు. ఓపి రికార్డు, ప్రసవాల తదితర రికార్డులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన వైద్యశాల సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం వైద్యశాలకు హాజరుకావాలని తప్పనిసరిగా విధుల్లో ఉండాలని మండల వాసులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు తమకు సంబంధించిన సెంటర్లలో తప్పనిసరిగా విధుల్లో ఉండాలన్నారు. వైద్యపరంగా పంచాయతీలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. నిష్పక్షపాతంగా దృఢమైన సంకల్పంతో నిజాయితీగా రాజీ లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఇతర విషయాలపై సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిని భావన, అదనపు వైద్యాధికారిని అరుణ జ్యోతి, సహాయ మలేరియా అధికారి వెంకట్ రెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల. సుబ్బరాయుడు, ఎంపీహెచ్ఈఓ రాధాకృష్ణారెడ్డి, పీహెచ్ఎన్ వెంకటసుబ్బమ్మ, సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి, తదితర సిబ్బంది ఉన్నారు.

## ఆక్రమణలు తొలగింపు



సిద్ధవటం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

భూ అక్రమాలపై రెవిన్యూ సిబ్బంది ఉక్కు పాదం మోపింది మండలంలోని పెద్దపల్లి రెవిన్యూ సర్వేనెంబర్ 937/తి ఉప్పరపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం 20 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణ పనులు కొంతమంది స్థానికులు చేపట్టడంతో బుధవారం మండల తహసిల్దార్ ఆకుల తిరుమల బాబు ఆదేశాలతో జెసిబి యంత్రంతో పూర్తిగా కట్టడాలు తొలగింపు చేశారు ఈ కార్యక్రమంలో ఎస్సై హారిక, మండల ఆర్ ఐ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ అంజి, వీఆర్వోలు, శివశంకర్, శ్యాంబాబు, కేశవులు, స్థానిక పోలీసులు, రాఘవ, రాముడు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## బస్సును వెనుక వైపున డీకొన్న కారు పలువురికి గాయాలు





మైదుకూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:,

మైదుకూరు పట్టణ పరిధిలోని నంద్యాల రోడ్డు బైపాస్ శ్రీనగరం వద్ద హైవే పై ఆళ్ళగడ్డ కు వెలుతున్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు కారు డీ కొట్టడంతో పలువురికి గాయాలు. ఈ సంఘటనలో ఇద్దరికి బలమైన గాయాలు కాగా ముగ్గరికి గాయాలు అయ్యాయి. తెలంగాణ రాష్ట్రం మెదక్ చెందిన సతీష్, మరో నలుగురు తిరుమలకు వచ్చి తిరుగు ప్రయాణంలో మైదుకూరు వద్ద ప్రమాద బారిన పడ్డారు. కారులో ఉన్న యశ్వంత్ ,సతీష్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి. రూప,మధు, సృజన్ లకు చిన్న పాటి గాయాలు అయ్యాయి. వెంటనే స్పందించిన అంబులెన్స్ సిబ్బంది వారిని చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. యశ్వంత్, సతీష్ లకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్ కు తరలించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## న్యూ వస్త్ర భారతిలో శ్రీ వల్లభ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ట

ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 23 ప్రభాతవార్త



మైదుకూరు రోడ్డులోని న్యూ వస్త్ర భారతి బిల్డింగ్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముందున్న ఆవరణంలో మంగళవారం శ్రీ వల్లభ లక్ష్మీ గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి కొత్తపల్లె మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి హాజరై కొత్తపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న న్యూ వస్త్ర భారతి బిల్డింగ్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఆయురారోగ్యాలతో వ్యాపారాభివృద్ధితో వర్ధిల్లాలని ఆయన అభిలాసించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వారు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నీవు వస్త్రా భారతి క్లాస్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుంకు మురళి మోహన్, వైస్ ప్రెసిడెంట్లు మోతుకూరు వెంకటసుబ్బయ్య,తిరుమల శెట్టి రామచంద్రుడు, జాయింట్ సెక్రెటరీ సోమ సురేష్, ట్రెజరర్ దొంతు నగేష్ బాబు అసోసియేషన్ సభ్యులు, బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీ, ఉపాధ్యక్షుడు వెంకట చలపతి, కార్యదర్శి శ్రీధర్, సహాయ కార్యదర్శి రమేష్, కోశాధికారి చంద్రమోళి, సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మహత్య ఘటనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

కడపలో జరిగిన రెహానా ఆత్మహత్య ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనకు బాధ్యుడిగా పేర్కొంటున్న షాజహాన్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని సమాఖ్య బద్వేలు ఏరియా కార్యదర్శి బొంత విజయ డిమాండ్ చేశారు. మృత్యుంజయ కుంటలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ, యోగి వేమన విశ్వవిద్యాలయం నుంచి పీజీ పూర్తి చేసిన రెహానా, నిశ్చితార్థం జరిగిన తరువాత వివాహాన్ని నిరాకరించడంతో మోసపోయి తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడటం దారుణమని అన్నారు. ఈ ఘటన సమాజానికి హెచ్చరికగా భావించాలన్నారు. నిందితుడితో పాటు అతని కుటుంబ సభ్యుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, విద్యార్థినులు ఇలాంటి పరిస్థితుల్లో ధైర్యంగా ఎదుర్కొని న్యాయం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నవనీతమ్మ, నాగమ్మ, ఖాజాబీ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.




## నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు



కడప కార్పొరేషన్ ఏప్రిల్ 23 ప్రభాతవార్త:

వేసవి కాలం దాహార్తి తీర్చడం కోసం కడప నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కడప నగరంలో పలు చోట్ల చెలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, బాటసారులు, వాహనాదారులు దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కడప నగరపాలక సంస్థ ఎస్ ఈ చెన్నకేశవరెడ్డి, ఈ ఈ అన్నారెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, డి ఈ ఈ మణి గోపాల్ రెడ్డి లు తెలిపారు. కడప నగరంలోనీ కోటిరెడ్డి కూడలి, ఎన్టీఆర్ కూడలి, ఐటిఐ కూడలి, పాత మున్సిపల్ కార్యాలయం దగ్గర, రాజీవ్ మార్క్ రోడ్డులో చలివేంద్రాల ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈ అంజనీ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధం, మంచినీటి వసతిపై ప్రత్యేక దృష్టి



బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 23 ప్రభాతవార్త

కాలజ్ఞాని కర్త జగద్గురు శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాములవారి గురుపూజ ఆరాధన మహోత్సవాల సందర్భంగా పారిశుద్ధం, మంచినీటి వసతి తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో మేనేజర్ ఈశ్వరాచారితో కలిసి మఠం ప్రాంగణంలోని చలువ పందిళ్లు, బ్రహ్మరథం తదితర వాటిని పరిశీలించారు. అంతకుముందు ఎంపీడీవో సాయిబాబా నగర్, పోలేరమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి జెసిబి తో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీవో వెంట ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, మండల పరిషత్ పరిపాలనాధికారి నరసయ్య, పిఆర్ ఏఈ మురళీధర్ రెడ్డి, ఏపీవో హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## విగ్రహ ప్రతిష్ట ప్రారంభించిన రాష్ట్ర అధికార ప్రతినిధి



సుండుపల్లి, ఏప్రిల్ 23,ప్రభాతవార్త :

మండల పరిధిలోని మాచి రెడ్డిగారి పల్లి గ్రామపంచాయతీ బండి వాండ్లపల్లిలో నిర్వహించిన సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు టిడిపి నాయకులు చప్పిడి మహేష్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకుల నుండి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు బుక్కేరెడ్డి నాయక్, ఎల్లయ్య, బాబు,డీలర్ సుబ్బరాయుడు, సదాశివ, సురేష్, జయరాం నాయక్, ఆనంద నాయక్, మల్లికార్జున నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైను లీకేజీకి మరమ్మత్తులు

వేంపల్లె:ఏప్రిల్ 23 ప్రభాతవార్త



వీరన్నగట్టువల్లి పాపాగ్ని నది నుంచి ఇడుపులపాయ గ్రామానికి వెళ్లే తాగునీటి పైపు లైను లీకేజీ కి గురయింది. దీంతో తాగునీరు వృధాగా పోతోంది. గత 5 రోజులుగా నీరు వృధాగా వెళుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గురువారం ఇడుపులపాయ గ్రామ ప్రజలు జనసేన నాయకులు పోతిరెడ్డి చలపతి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులు వెచ్చించి మరమ్మత్తులు చేయించారు. దీంతో ఇడుపులపాయ గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## బ్రాహ్మణ సమ్మేళనం విజయ వంతం చేయండి

వేంపల్లి:ఏప్రిల్ 23 ప్రభాతవార్త



కడపలో ఆదివారం నిర్వహించే బ్రాహ్మణ సమ్మేళనంను జిల్లాలోని బ్రాహ్మణులు హాజరు అయి విజయవంతం చేయాలనీ బ్రాహ్మణ సంఘం నాయకులు పీవీయెస్ వి ప్రసాదరావు సూగురు రఘునాథరావు పిడతల గోపాలకృష్ణ బ్రాహ్మణ పల్లి చంద్రమోళి శర్మ వారణాసి శ్రీధర్ శర్మలు ఒక ప్రకటన లో విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్నా సమస్యలు సమస్యలు పై దూపదీప నైవేద్యం కింద ఆర్థిక సహాయం పొందే అర్చకుల సమస్యలు పై ప్రభుత్వం కు ప్రజా ప్రతినిధులు ద్వారా తీసుకొని పోవడానికి కృషి చేస్తున్నట్లు అందుకు అందరి సహకారం అవసరం అని అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ హాజరు అయ్యే ఈ సమావేశంలో పలు సమస్యలు ఇంటి స్థలాలు మొదలగు విషయాలు పై కార్పొరేషన్ సబ్సిడీ పథకాల పై చర్చించుతామణి అన్నారు.

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా వడిబియ్యం కార్యక్రమం





**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ మాసం పురస్కరించుకుని నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి మరియు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాసవి మాత అమ్మవారికి ఒడిబియ్యం వల్లింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలను ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి కమిటీ సభ్యులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మహిళా భక్తులను సమన్వయం చేస్తూ, అమ్మవారి సేవలో అందరూ తరించేలా వారు ఈ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు, గురువారం సాయంకాలం వడిబియ్యం కార్యక్రమం అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన వడిబియ్యం సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సేవలో పాల్గొన్న ఉభయ దాతలు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు పలికారు. అమ్మవారికి ఒడిబియ్యం వల్లింపు కార్యక్రమాన్ని హైదరాబాద్ డాక్టర్ చిన్ని రాజేష్ సతీమణి కళ్యాణి, శ్రీరామ్ నాగేశ్వరరావు సతీమణి శైలజ, అమర శివ రామకృష్ణ సతీమణి శకుంతల, మంచి కంటి వేణుగోపాల్ సతీమణి సుమలత, పెనుబోలు సునీల్ కుమార్ సతీమణి బేబీ సింధూరి, మడియాల జగదీష్ సతీమణి స్నేహలత తో పాటు పలువురు తో వాసవి మాత అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు, వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్న పలువురు భక్తులకు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు సెక్రటరీ శ్రీనివాసులు తోపాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు ఈ కార్యక్రమంలో పత్తి తేజ, మరియు పలువురు ఆర్యవైశ్య మహిళలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 26 న చలో తిరుపతి గోడపత్రాలు ఆవిష్కరణ



**వేంపల్లి: ఏప్రిల్ 23 ప్రభాతవార్త**
ఏప్రిల్ 26 నుంచి 28 వరకు తిరుపతిలో జరిగే ఏఐటియుసి 18 రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసి. బాదుల్లా భువన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బళ్లారపు రామాంజనేయులు లు విజ్ఞప్తి చేశారు.గురువారం స్థానిక వేంపల్లి యందు ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు సంబంధించిన గోడ పత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు నోయిడాలో కార్మికుల ఆందోళన కార్యక్రమాలు చూసైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరచి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలలో కార్మికవర్గం ఎదుర్కోంటున్న సమస్యలుపై తీర్మానాలు చేసి చర్చిస్తామని, రాబోయే కాలంలో కార్మికవర్గ పోరాటలకు దిశానిర్దేశం చేయడానికి దోహదపడుతాయని అన్నారు. 1921 అక్టోబర్ 31న స్వాతంత్ర్య పోరాటం కార్మికులు హక్కుల నినాదంతో స్థాపించన ఏఐటియుసీ నేడు 106 సం ఉద్యమ చరిత్ర కలిగిన భారతదేశంలోని ఏకైక కేంద్ర కార్మిక సంఘంగా ఉందని అన్నారు. కార్మికుల హక్కులు, వేతనాలు, పని పరిస్థితుల మెరుగుదల, సామాజిక న్యాయం పెట్టుబడిదారీ దోపిడీకీ వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. కార్మిక హక్కుల రక్షణ, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాల కోసం మరియు ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్త ఆందోళనలు, సమ్మెలు నిర్వహిస్తుందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు కాలరాస్తూ 44 కార్మిక చట్టాలు రద్దు చేసి వాటిస్థానంలో 4 లేబర్ కోడ్లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మికవర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులు యాజమాన్యాలుగానీ ప్రభుత్వాలుగానీ తమ దయాదాక్షిణ్యాలతో చేయి విదిలించిన సందర్భాలు లేవు. ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, చట్టాలు పోరాడి సాధించుకున్నవే తప్ప బుర్జువా పాలకులు ఇష్టంతో ప్రసాదించినవి కాదని అన్నారు. అసంఘటిత రంగ ఆటో హమాలీ వీధి విక్రయ దారులకు సమగ్ర సంక్షేమ చట్టాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించలేదని అన్నారు. వివిధ ప్రభుత్వ రంగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులకు స్కీం వర్కర్లకు కనీస వేతనం 26 వేలు రూపాయలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మల్లేశ్ బాబాపక్రుద్దీన్ వెంకటేశ్ అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

# బడి మనది బాధ్యత మనందరిది



**కలసపాడు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**
చదువుతోపాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కారణమైన ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పిస్తే వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే బాధ్యత మాదని ప్రధానోపాధ్యాయుడు బి భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్ బాబు రమణారెడ్డి, చెన్నయ్య, శివారెడ్డిలు పేర్కొన్నారు. పాఠశాల చివరి పని దినం సందర్భంగా కలసపాడు లోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల లో గురువారం నిర్వహించిన 5వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. మొదట తరగతి వారీగా ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాప్రగతి గురించి తల్లిదండ్రులకు వివరించారు. వేసవి సెలవులలో పిల్లలను ఎండలో తిరగకుండా, చెరువులు కాలువల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దేశంలోని గొప్ప గొప్ప మేధావులు అందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని, చదువుతోపాటు సంస్కారం, నైతిక విలువలు, నిజజీవితంలో కావలసిన మెలకువలు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే నేర్పుతారన్నారు. అనుభవజ్ఞులైన, అర్హతలు గల ఉపాధ్యాయులతో పాటు, ప్రభుత్వం పలు రకాలైనటువంటి సౌకర్యాలు, సదుపాయాలు విద్యార్థులకు కల్పిస్తుందన్నారు. చిన్న చిన్న చదువులకు లక్షలకు లక్షలు ఖర్చుచేసి కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులందరూ ఈ పాఠశాలలో మా పిల్లలకు చదువు చక్కగా వస్తుందని, పిల్లలందరినీ ఈ బడికే పంపిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ సెంటర్లకు ముందుగా చేరుకోవాలి.

**మైదుకూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2026ను సజావుగా నిర్వహించుటకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయబడ్డాయి. ఈ పరీక్ష 25042026 25 04(శనివారం) నాడు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని 28 జిల్లాలలోని 120 పట్టణాల్లో 579 పరీక్షా కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకొని, కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవలసిందిగా సూచించబడుతున్నారు. పరీక్షా కేంద్రాలలో ప్రవేశం ఉదయం 10:00 గంటల నుండి 11:00 గంటల వరకు మాత్రమే అనుమతించ బడుతుంది. ఉదయం 11:00 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ అభ్యర్థిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.ఏదైనా కారణాలవల్ల హాల్ టికెట్ పొందలేని అభ్యర్థులు, పరీక్ష రోజు ఉదయం 7:00 గంటల నుండి 9:00 గంటల వరకు పాలిటెక్నిక్స్ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కేంద్రాలను సంప్రదించవచ్చు. అటువంటి అభ్యర్థులు కింది పత్రాలను తీసుకురావలెను 1). ఎస్ ఎస్ సి హాల్ టికెట్ ప్రతిలిపి, 2). ఆధార్ కార్డు ప్రతిలిపి, 3). ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో అలాగే, ఓసి /బిసి అభ్యర్థులు రూ. 400/ మరియు ఎస్ సి/ఎస్ టి అభ్యర్థులు రూ. 100/ ఫీజును చెల్లించవలెను.

# చేతిరాత మెరుగైతే భవిష్యత్తు వెలుగులు

**పులివెందుల ఏప్రిల్ 23, ప్రభాత వార్త :**
విద్యార్థుల చేతిరాత చక్కగా ఉంటే వారి భవిష్యత్తు కూడా ఉన్నతంగా ఉంటుందని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక వైఎస్ వెంకట్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సన్మాన సభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించడం ప్రశంసనీయమని అన్నారు. విద్యార్థుల విజయానికి తోడ్పడిన అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు.ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తీర్ణత శాతం పెంచడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. మంచి చేతిరాత విద్యలో మెరుగుదలకు దోహదపడుతుందని, అది భవిష్యత్తు ఎదుగుదలకు మార్గం సుగమం చేస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన హలీమా, సాదియా, జోష్ణ, శైలజ, చైతన్య, సునీత రెడ్డి, కుందనలకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. అలాగే తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన తన్విత, ఆర్సియా, రజితలకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందించారు. ఈ నగదు బహుమతులను ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తన తల్లి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసి, వెంకటేశ్వర్ల చేతుల మీదుగా విద్యార్థినులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అనిత, నాగేంద్రమ్మ, సుధాకర్ రెడ్డి, త్రివేణి, రామచంద్రారెడ్డి, బాల దస్తగిరి, రామసుబ్బయ్య, రామయ్య, సత్యవతి, లక్ష్మి, జయశ్రీ, రమాదేవి, సునీత, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

# కృషి, క్రమశిక్షణతో విజయం ఖాయం

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలీసెట్-2026) ఉచిత శిక్షణ కార్యక్రమం ముగింపు వేడుక గురువారం ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జరిగింది. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉచిత శిక్షణ పొందిన సుమారు 300 మంది విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థులు ప్రతిభను అంచనా వేయడంతో పాటు పోటీ పరీక్షలకు మరింత సిద్ధం అయ్యేలా ప్రోత్సహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ పాలలెం గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలు గ్రామీణ మరియు పేద వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పాలీసెట్-2026 పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు సమాన అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమని తెలిపారు. క్రమశిక్షణ, కృషి, ఆత్మవిశ్వాసం ఉంటే విజయాన్ని సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు వీరభద్రారెడ్డి, శీను, బాబు, విజయకుమార్, మంజునాథ్, సుబ్రమణ్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



# బడిలో వడిగా ప్రవేశాలు

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిపిలుస్తోంది కార్యక్రమంలో ఎగువపల్లి ఉన్నత పాఠశాల 6వ తరగతిలోకి, స్థానిక దిగువపల్లి మోడల్ ప్రాథమిక పాఠశాల నుంచి 5వ తరగతి పూర్తి చేసిన 17 మంది పిల్లలు పాఠశాల చివరి పనిదినం 23న అడ్మిషన్లు జరుగుతున్నాయని పీఎస్ హెడ్మాస్టర్ గౌరీశంకర్ వారి పిల్లలతో కలిసి వారి బదిలీ పత్రాలు ఎగువపల్లి ఉన్నత పాఠశాల ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు సలీంబేగ్కు సమర్పించారు. కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయులు గునిశెట్టి శ్రీనివాసులు, హిందూ ఎఫ్ఎంఎస్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. మరింత మంది పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది తల్లిదండ్రులను కోరారు. జనగణన పోటీల విజేతలకు పతకాలు పంపిణీ 2027 జనగణన సందర్భంగా స్థానిక ఎగువపల్లి ఉన్నత పాఠశాల పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలలో గెలుపొందిన విజేతలకు మెడల్స్ను ఇన్ఛార్జి ప్రధానోపాధ్యాయులు గునిశెట్టి శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, పుష్పలత, రవి, ఖాదర్ తదితరులు అందజేశారు.




# పెరాలసిస్ బాధితుణ్ణి పరామర్శించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**చిన్నమండెం ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**
మండలంలోని కురువపల్లె గ్రామానికి చెందిన శివయ్య పెరాలసిస్ తో బాదపడు సంఘటన తెలుసుకుని రాష్ట్ర రవాణా, యువజన శాఖ మంత్రి గురువారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా శివయ్య ఆరోగ్య పరిస్థితులు గురించి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అవసర మైన వైద్యం అందించేందుకు తగు చర్యలు తీసుకొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# రీ సర్వే పై అవగాహన సదస్సు



**చిన్నమండెం ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**
మండలంలోని కేశాపురం గ్రామంలో మే 1 వ తేదీ నుండి ప్రారంభం కానున్న రీ సర్వే కార్యక్రమం పై గురువారం గ్రామ పంచాయతీ సచివాలయంలో తహ శీల్దార్ రామాంజనేయులు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీ సర్వే ఎలా జరుగుతుంది రి సర్వే లో భూమిని ఎలా కొలతల వేస్తారు,భూమి సమస్యలు ఉంటె ఎలా పరిష్కారం చేసుకోవాలి అన్న విషయా లపై ప్రజలకు తహసీల్దార్ వివరించారు. భూములు గురించి సమాచారం తెలుసుకోవాలి అన్న విషయాన్ని క్షుణ్ణంగా తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ నందివర్ధన్ రెడ్డి ,ఆర్ ఐ శిల్పా మండల సర్వేయర్ శ్యామల, వి ఆర్ ఓ మనీల దేవి రెవెన్యూ సిబ్బంది.మండల టీడీపీ అధ్యక్షుడు మూగి రెడ్డెప్ప ప్రజలు పాల్గొన్నారు.

# మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్గా గోపీనాథ్



**తంబళ్లపల్లె ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
తంబళ్లపల్లె మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్గా గోపీనాథ్ బాధ్యతలు చేపట్టాడు. ఆయన చిత్తూరు జిల్లా నారాయణవనం జడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదోన్నతిపై తంబళ్లపల్లె మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్గా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బాల కృష్ణ నాయక్ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పై బైరెడ్డిపల్లి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. గోపీనాథ్ను ఏవో థామస్ రాజా, డిప్యూటీ ఎంపీడీవో లు ప్రసాద్, మారుతీ కుమార్, టైపిస్ట్ సురేంద్ర, జూనియర్ అసిస్టెంట్ విజయ్, ఆఫీస్ సబార్డినేట్లు ఖయ్యూం, నాగరాజులు అభినందించి స్వాగతించారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు



**మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్లో శ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, సాధికారిత అధికారి పి.తేజశ్వని అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాధికారిత కన్వీనర్ టి.వేణుగోపాల్, సభ్యులు కిరణ్కుమార్, గంగులప్ప, హరినాథ్, లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు, బిసిసంఘం నాయకులు పాల్గొన్నారు.

# నేడు సంతానం లేని దంపతులకు ఉచిత శిబిరం

## చెన్నై వైద్యులచే మెరుగైన చికిత్సలు


చెన్నై వైద్యులు సంహిత

**మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
సంతానం లేని దంపతులకు శుక్రవారం సొసైటికాలనీలోని శ్రీ మారుతి హెల్త్ హోమ్ వద్ద ఉచిత సంతాన సాఫల్యం శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీదేవి తెలిపారు. గురువారంఆమె విలేకర్లతో మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులకు చెన్నైలోని ప్రముఖ వైద్యశాల ఫెర్టిలిటి రీసర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్లు ప్రసాద్, శ్రీదేవి, సంహితల ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల పిల్లలు లేని స్త్రీలకు ఐయూఐ, ఐవిఎఫ్, ఐసిఎస్ఐ, ఐఎంఎస్ఐ వంటి పద్దతిలో వీర్యకణాలు, అండాలను నిల్వ చేసుకునే సదుపాయం ద్వారా చికిత్సలు అందించి సంతానం కలిగేలా ప్రయత్నం చేస్తామన్నారు. అండాల సంఖ్య తక్కువగా ఉన్నవారికి చికిత్స, గర్భసంచిలో, అండాశయంలో కణితులు,ట్యూబ్స్ మూసుకుపోవుటకు చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. పురుషులకు ప్రత్యేక చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు లేని దంపతులు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# మదనపల్లి గిరిజన గురుకులంలో ప్రవేశాల సందడి

**మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త.**
మదనపల్లి పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె. రంగనాయకులు తెలిపారు. మొత్తం ఖాళీలలో 3వ తరగతికి అత్యధికంగా 40 సీట్లు ఉండగా, మిగిలిన తరగతుల్లో 4వ తరగతికి 36, 5వ తరగతికి 32, 6వ తరగతికి 25, 7వ తరగతికి 21, 8వ తరగతికి 19 మరియు 9వ తరగతికి 22 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉన్న బ్యాక్లాగ్ ఖాళీలను కేవలం ఎస్.టి విద్యార్థులతో మాత్రమే భర్తీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. 6 నుండి 9వ తరగతులకు దరఖాస్తులు ఎక్కువగా వస్తే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, యూనిఫాం మరియు పుస్తకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మే 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9490601554 లేదా 9493800272 నంబర్లను సంప్రదించాలని కోరారు.




# బాల్యవివాహాల నిర్మూలనలో మండలాన్ని ఆదర్శంగా నిలువుదాం : ఎంపీడీవో



**చిన్నమండెం ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**
కౌమార దశలో జరిగే బాల్య వివాహాలను నిర్మూలించి ఆడపిల్లలకు కౌమారదశ లో గర్భాధారణ సమస్యలు రాకుండాచేసి మండలాన్ని ఆదర్శంగా నిలువుదామనే ఎంపీడీవో ఆదినారాయణ పిలుపునిచ్చారు స్థానిక ఎంపీడీవో సభా భవనంలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కౌమార దశలో గర్భధారణ సమస్యలు కారణాలు అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మండలంలో ఐ సి డి ఎస్ ఆరోగ్యశాఖ పోలీస్ శాఖలు సంయుక్తంగా పనిచేసే బాల్యవివాహాలను నిర్మూలించి అన్నమయ్య వైఎస్ఆర్ కడప చిత్తూరు జిల్లాలో ఆదర్శ గా నిలువుదామని పేర్కొన్నారు ఎస్ఐ సుధాకర్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో తమ డిపార్ట్మెంట్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్ఓ శివశంకర్ మాట్లాడుతూ చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు లీగల్ అథారిటీ ప్రతినిధి క్యారున్ గ్రామాలలో నేటికీ బాల్య వివాహాలు తరచుగా చేస్తూనే ఉన్నారని వీటి నిర్మూలనకు అంగన్వాడీలు ఆశ వర్కర్లు గ్రామస్థాయిలోగ్రామ పెద్దలతో మాట్లాడి వారిలో అవేర్నెస్ తీసుకురావలన్నారు ఐ సి డి ఎస్ సూపర్వైజర్లు పవన కుమారి లక్ష్మమ్మ మాట్లాడితూ కౌమార దశలోనే గర్భధారణ వల్ల అనేక సమస్యలు వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని మూడు సెక్టార్ల అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దైవభక్తిని పెంపొందించుకోవాలి

## రాష్ట్ర తెలుగుయువత ఆధ్యక్షులు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**
ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకొని సమాజసేవకు ఉపయోగపడేలా ఉండాలని రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్బిఐ కాలనీ గొల్లపల్లె నందు దేవస్థానం కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు శ్రీ మహామారెమ్మ తల్లి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంతో విశిష్టత కలిగిన అమ్మవారి శంకుస్థాపన, మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షులు బి.రామక్రిష్ణారెడ్డి, సెక్రటరీ గంగసాని మస్తాన్రెడ్డి, ట్రెజరర్ భవాని, ఉపాధ్యక్షులు ప్రసాద్, అలయసభ్యులు, తెలుగుయువత నాయకులు మహబూబ్ఖాన్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

# యాళివాహనంపై దేవదేవుడు



**చౌడేపల్లి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**
అభీష్టధ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం దేవదేవుడు యాళివాహనంపై ఊరేగాడు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. వాహనసేవకు పట్టణానికి చెందిన అశోక్, సుదర్శన్లు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు పర్యవేక్షించారు.

# రైతులు సరైన మెలుకవులు పాటించి పంటలను రక్షించుకోవాలి


ఏటీఎం పద్ధతిలో సాగు చేసిన పంటను పరిశీలన

**కె.వి పల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**
రైతులు సరైన మెలుకవులు పాటించి వేడి గాలుల నుంచి పంటలను రక్షించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని బోడుమల్లువారిపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు వేడి గాలుల ప్రభావంతో పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రీ మాన్సున్ డ్రై సోయింగ్, ఏటీఎం, డీఆర్పీఎం పద్ధతుల గూర్చి రైతులకు వివరించారు. రాబోయే సీజన్లో నీటి ఎద్దడిని ఎదుర్కోడానికి తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పప్పు ధాన్యాలు, కూరగాయలు, దుంపలు సంవత్సరం పొడవునా భూమి మీద పచ్చగా ఉండేలా సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చునని. తెలిపారు. ఠాణా వడ్డిపల్లె ఏటీఎం పద్ధతి సాగు చేసిన పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి సుకుమార్ రెడ్డి. వ్యవసాయ సిబ్బంది. శ్రీదేవి, సుబ్రమణ్యం, ఏఈవోలు నజీర్, జహీర్, రైతుసేవా కేంద్రం సిబ్బంది. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా అపర భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు





**కడప, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**

భగీరథ మహర్షి పట్టుదల, సంకల్పానికి నిలువెత్తు నిదర్శనమని, లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని ఆయన జీవిత సారాంశం తెలుపుతుందని ఇంచార్జి డిఆర్ఓ వేంకటపతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి డిఆర్ఓ వేంకటపతి మాట్లాడుతూ ఆశయ సాధన, అకుంఠిత దీక్ష, పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం అపర భగీరథ మహర్షి అని కొనియాడారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయం అన్నారు. భగీరథ మహర్షి మహాజ్ఞాని అని, పరోపకారానికి పెట్టింది పేరని, దీక్షా, సహనానికి ప్రతిరూపమని, ఎంతటి కష్టాన్నైనా లెక్కచేయకుండా అనుకున్నది సాధించే గుణం గల వారిని ఆయన అన్నారు. ఏదైనా పనిని సంకల్పించినప్పుడు అపర భగీరథునితో పోలుస్తారన్నారు. వజ్ర సంకల్పంతో లక్ష్యాలను సాధించాలని భవిష్యత్ తరాలకు భగీరథ మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మనందరం కూడా ఆయన బాటలో నడవాలని కోరారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అపర భగీరథ మహర్షి యొక్క అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా మహనీయులను, గొప్పవారిని మర్చిపోకుండా భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోష దగ్గ విషయమన్నారు. ఎంత కష్టమైన పనినైనా విజయం సాధించడంలో అపర భగీరథ మహర్షికే చెల్లిందని ప్రశంసించారు. పలువురు బీసీ, సగర, సంఘం సభ్యులు మాట్లాడుతూ.. భగీరథ మహర్షి సేవానిరతి గొప్పదని, దేశం గర్వించదగ్గ మహనీయులలో ఆయన ఒకరని కొనియాడారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సాగు నీరందించాలనే గొప్ప ఆశయంతో నీటిపారుదల ప్రాజెక్టులను నిర్మించి అపర భగీరథుడయ్యారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో మరుగున పడిన మహనీయుల ఆశయాలను, భావాలను ఈనాటి యువతరానికి తెలియజేయాలని.. ఇటువంటి కార్యమాలను చేపట్టడం హర్షణీయమన్నారు. దృఢ సంకల్పం ఉంటే ఎంత కష్టతరమైన పనైనా సాధించవచ్చునని భగీరథ మహర్షిని చరితం ద్వారా మనం నేర్చుకోవాలన్నారు. అంతేకాకుండా పట్టుదల, కష్టానికి మారు పేరుగా గుర్తింపబడిన సగర వంశం, ఉప్పర జాతి ఆవిర్భావం, భగీరథ జీవిత సారాంశాన్ని వారు క్షుణ్ణంగా వివరించారు. ముందుగా భగీరథ మహర్షి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎస్ క్రిష్ణ, యాదవ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ యాదవ్, సగర సంఘం సలహాదారు వెంకటయ్య, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ఉప్పర జిల్లా అధ్యక్షులు సానే శ్రీనివాసులు, సగర కమ్యూనిటీ సభ్యులు అనురాధ, వివిధ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రతినిధులు, పలువురు బీసీ, సగర, ఉప్పర కుల సంఘ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి పోస్టులకు ఇంటర్వ్యూలు




**బద్వేలు, ఏప్రిల్ 23, ప్రభాత వార్త**

బద్వేలు రెవెన్యూ డివిజనల్ పరిధికి సంబంధించి గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి, బద్వేల్ ఏ. చంద్రమోహన్ అధ్యక్షతన స్థానిక ఆర్డీవో, బద్వేల్ వారి కార్యాలయం సభా భవనం నందు 3 అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు, 20 అంగన్వాడి హెల్పర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డిప్యూటీ డిఎంహెచ్వో, బద్వేల్ వీర మల్లేష్, చాపాడు సిడిపిఓ, ముంతాజ్ బేగం, బద్వేలు సిడిపిఓ, శ్రీదేవి, మైదుకూరు, సిడిపిఓ, శ్రీదేవి, పోరుమామిళ్ల సిడిపిఓ, జమాల్ బి పాల్గొన్నారు.

# డేటా సేకరణ సక్రమంగా నిర్వహించాలి



**దువ్వూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

మే 1వ తేదీ నుండి జరిగే జనగణన డేటా సేకరణ సక్రమంగా నిర్వహించాలని మండల తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డిలు అన్నారు. గురువారం జనగణన సేకరణ 2వ విడత ఎన్యుమినేటర్లకు శిక్షణ కార్యక్రమం ముగింపు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్యుమినేటర్లకు ఇచ్చిన ఇళ్ల జాబితాను పరిశీలించి వాటిని ఖచ్చితంగా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఇళ్ల గణనకు మే 1 నుండి 30వరకు ప్రజల వద్దకు ఎన్యుమినేటర్లు వస్తారని వారిది ప్రజల సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు అడిగే ప్రశ్నలకు ఎన్యుమినేటర్లు కూడా సమాధానం ఇవ్వాలన్నారు. అలాగే ఇళ్లకు మార్కింగ్, నెంబర్లు వేస్తారని వాటికి అనుమతించాలన్నారు. స్వీయ గణన కార్యక్రమం జరుగుతుందని ప్రజలు వాటి ద్వారా నమోదు చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ జాన్సన్, సర్వేయర్ మధుసూదన్‌రెడ్డి, రమేష్, గురురాఘవేంద్ర పాల్గొన్నారు.

## వారం లోగా సాగు నీటి

# సమస్యలను పరిష్కరిస్తాం

**పులివెందుల ఏప్రిల్ 23, ప్రభాత వార్త :**



పులివెందుల ప్రాంతంలో సాగునీటి సమస్యలను ఒక వారంలోగా పరిశీలిస్తామని రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎపుడు ముందుంటుంది అని గత ప్రభుత్వం లో జరిగిన వైఫల్యాల వలనే ఈ దుస్థితి వచ్చింది అని టీడీపీ నేత బీటెక్ రవి అన్నారు. గురువారం బిటెక్ రవి మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు."షర్మిలమ్మ చెప్పినట్టు గొడ్డలితో రక్తం పారించడం కాదు అని దమ్ముంటే మీ సొంత డబ్బు ఖర్చు పెట్టి రైతులకు నీళ్ల అందించండి" అంటూ వైఎస్ షర్మిల వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ రవి విమర్శించారు. 2019-2024 మధ్య కాలంలో అధికారంలో ఉన్నప్పటికీ పులివెందులలో ఒక్క అదనపు ఎకరాకైనా నీళ్లు అందించలేదని ఆయన ప్రశ్నించారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ మెటీరియల్ నిలిపివేయడం వెనుక 300 కోట్ల బకాయిలు కారణమని చెప్పడం సరికాదని, అదే సమయంలో ప్రభుత్వం ఎందుకు ఆ బకాయిలను చెల్లించలేదని నిలదీశారు. టీడీపీ పాలనలో నల్లపురెడ్డిపల్లె, నల్లగొండ వారిపల్లె ప్రాంతాలకు సాగునీరు అందించి రైతులను సుభిక్షంగా ఉంచామని ఆయన తెలిపారు. రైతులకు ఏం చేయాలో తమకు తెలుసని, చిత్తశుద్ధితో పనిచేస్తామని స్పష్టం చేశారు. లింగాల మండలంలోని కొమ్మనూతల, తాతిరెడ్డిపల్లె గ్రామాలకు వారం రోజుల్లోనే నీటి సరఫరా కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాట ఇస్తే వెనక్కి తగ్గని ప్రభుత్వం తమదేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, గతంలో పులివెందుల మోటార్లను ఉప్పలూరు, కలుసపాడు ప్రాంతాలకు తరలించడం ద్వారా ఈ ప్రాంతానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. 2022లో తక్కువ అంచనాలతో నిర్వహణ పనులు చేసి, ఇప్పుడు రిపేర్లకు కోట్ల రూపాయలు ఖర్చవుతున్న పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. సొంత డబ్బు ఖర్చు పెట్టడాన్ని టీడీపీ అడ్డుకుంటోందని చెప్పడం పచ్చి అబద్ధమని, ఏ అధికారి అలా చెప్పాడో పేరు వెల్లడిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని సవాల్ విసిరారు. దొండ్లవాగు గ్రామానికి సంబంధించిన దేవాలయ నిధులను కూడా తిరస్కరించే స్థితికి చేరుకోవడం, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి పరాకాష్టగా ఉందని ఆయన విమర్శించారు. భూమాయగారిపల్లెతో పాటు పులివెందుల ప్రాంతంలోని ప్రతి రైతును సుభిక్షంగా ఉంచే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని బీటెక్ రవి పేర్కొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్త వహించండి



**సిద్ధవటం ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**

అధిక ఉష్ణోగ్రతల పట్ల వృద్ధులు వయోవృద్ధులు పిల్లలు జాగ్రత్త వహించాలని మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అలీఖాన్ తెలిపారు మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గురువారం 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మాధవను ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అలీఖాన్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల పట్ల వృద్ధులు వయోవృద్ధులు పిల్లలు జాగ్రత్త వహించాలని వడదెబ్బ నివారణ కొరకు, శీతల పానీయాలు మజ్జిగ కొబ్బరి బోండాలు తీసుకోవాలని అవసరం ఉంటే తప్ప ఎవరు ఇంటి నుండి బయటకు రావద్దని తెలిపారు ఇంటి నుండి బయటకు వచ్చువారు తప్పనిసరిగా గొడుగులు వాడాలని ఏదైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే స్థానిక ప్రభుత్వాలు వైద్యశాలకు వెళ్లాలని రోగులకు సూచించారు ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రావణి, ఆరోగ్య కార్యకర్త యశోద, ఆశ వర్కర్లు, సారమ్మ ఇంద్రావతి, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్వీట్లు పండ్లు పంపిణీ



**సిద్ధవటం ఏప్రిల్ 26 ప్రభాతవార్త**

ఈరోజు జంగాలపల్లె ప్రాథమిక పాఠశాల చివరి రోజు కావడంతో విద్యార్థులకు రాజంపేట ఇంచార్జ్ చామర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు పాఠశాలనందు విద్యార్థులకు స్వీట్లు పండ్లు ఇవ్వడమైనది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సుభాష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఈ సెలవు దినాలలో అధిక ఉష్ణోగ్రతలు కారణంగా అనవసరంగా పిల్లలు బయటికి వెళ్ళకండి ఇంటి వద్ద ఉండి చదువుకోండి నదుల వద్దకు చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లి ఈత కొట్టడం అలాంటి పనులు చేయకండి ఈతకు వెళ్లాలనుకుంటే పెద్దలతో కలిసి వెళ్ళండి అని ఉపాధ్యాయులు విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పడమైనది ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు ఉపాధ్యాయులు పోతురాజు సుభాష్ బాబు మధు పాల్గొన్నారు.

## ముగిసిన జగన్

# పులివెందుల పర్యటన

బెంగళూరుకు బయలుదేరిన జగన్‌కు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మొత్తంగా మూడు రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో జగన్ ప్రజలతో నేరుగా మమేకమవుతూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# ఇసుక తరలింపును రద్దు చేయాలని డిమాండ్

**సుండుపల్లి, ఏప్రిల్23, ప్రభాతవార్త:**



మండలం ఎర్రమనేనిపళ్ళెం వద్ద గతంలో తాత్కాలికంగా అనుమతులను రద్దు చేయాలని జనసేనపార్టీ సీనియర్ నేత రామ శ్రీనివాస్ కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు యువనేత లోకేష్‌కు జిల్లా కలెక్టర్ వారికి జడ్పీ సమావేశంలో డివిషన్ మండల స్థాయి అధికారులకు పలు మార్లు అర్జీలు ద్వారా పిర్యాదు చేయడంతో జిల్లా విసులన్స్ అధికారి సుబ్రహ్మణ్యం మరియు సిబ్బంది మైన్స్ ఏ డి సి వెంకటసుబ్బారెడ్డి మరియు సిబ్బంది టి.సుండుపల్లి సబ్ ఇన్స్పెక్టర్ యస్ కె ఎం హుస్సేన్ పోలీసు అధికారులతో క్షేత్ర స్థాయి పర్యటన సందర్భంగా త్రాగునీరు సాగునీటి ఎద్దడి తీవ్రతపై ఇసుక తరలింపును శాస్వితంగా తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ.. వారితో కలిసి జనసేన, టీడీపీ శ్రేణులు కూటమి నేతలు చప్పిడి మహేష్ నాయుడు, మచ్చా లక్ష్మీ నారాయణ, యూసుఫ్, యర్రంరెడ్డి, శ్రీనివాసరాజు, వెంకటయ్య తదితర స్థానికులు బహుదానది పరీవాహక ప్రాంతంలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పిహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



**నందలూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:**

రాష్ట్ర మలేరియా విభాగం డిప్యూటీ డైరెక్టర్ టి. రామనాథం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం నిర్వహించిన ఈ తనిఖీలో ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందించారు. ఆరోగ్య సేవల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన ఆయన, విధుల నిర్వాహణలో మెరుగైన పనితీరు కనబరుస్తున్న డాక్టర్ శరత్ కమల్ కుమార్, డాక్టర్ కార్తీక్‌లను అభినందించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ టి. వెంకటనారాయణ, ఇంచార్జ్ జిల్లా మలేరియా ఆఫీసర్ వెంకట్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, సూపర్వైసర్ సునీల్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉషోదయ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు..

**రాజంపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**



చిన్నారులతో కలిసి పాల్గొన్న కరస్పాండెంట్ వినయ్

విద్యార్థులకు నేటి నుంచి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో చివరి రోజు గురువారం రాజంపేట ఆర్ఎస్ రోడ్ లోని ఉషోదయ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంతోషంగా సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకలు ఉషోదయ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సంభావ వినయ్ కుమార్, డైరెక్టర్ మానస ఆధ్వర్యంలో ఎంతో ఆహ్లాదకరంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉషోదయ స్కూల్ నందు నర్సరీ నుండి 7 క్లాస్ చదువుతున్న ప్రతి విద్యార్థినీ ఘనంగా మెడల్, మెరిట్ సర్టిఫికెట్ మెమెంటో తో సత్కరించారు. ఈ సందర్భంగా ఉషోదయ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ కుమార్ మాట్లాడుతూ స్కూల్ను ప్రారంభించిన మొదటి సంవత్సరంలోని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యార్థులు మేనేజ్మెంట్కు ఎంతో సహకరించారని ఇలాంటి సహకారం ఫ్యూచర్ లో కూడా లభించాలని అదేవిధంగా విద్యార్థులు క్రమశిక్షణతో అంకితభావంతో చదివి స్కూల్ కి తల్లి దండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్చార్జ్ సౌమ్య, ఫిజికల్ డైరెక్టర్ మురళి, స్కూల్ ఉపాధ్యాయ బృందము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్‌లో ఐఐఐటి విద్యార్థులు ప్రతిభ

**వేంపల్లి:ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 20 26 మార్చి 7 నుండి 8 వరకు బెంగళూరులో నిర్వహించబడింది. ఈ పోటీలలో ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్‌కు చెందిన బీటెక్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. రాఘవేంద్ర 53 కిలోల జూనియర్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. మెహబూబ్, మొదటి సంవత్సరం బి.టెక్, 74 కిలోల సబ్‌జూనియర్ విభాగంలో వెండి పతకం గెలుచుకున్నాడు. సువర్ణ, రెండవ సంవత్సరం బి.టెక్, 52 కిలోల జూనియర్ విభాగంలో వెండి పతకం సాధించింది. సుప్రజ(రెండవ సంవత్సరం బి.టెక్) 52 కిలోల సబ్‌జూనియర్ విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది. కె. శివ ఈ పోటీలలో పాల్గొన్నాడు. ఈ విజేతలను ఆర్జీయూకేటీ ఆర్కే వ్యాలీ క్యాంపస్ డైరెక్టర్ ఎ.వి.ఎస్.ఎస్. కుమార స్వామి గుప్త, ఈసీఈ విభాగాధిపతి సుధాకర్ కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కోటేశ్వరి అభినందించారు.



# ప్రోత్సాహక నగదు బహుమతి



**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 23 ప్రభాత వార్త**

శ్రీవిద్యా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి కుండ తిరుమల గణేష్ సీనియర ఇంటర్ ఎంపీసీ ఫలితాలలో 994 మార్కులతో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినందుకు జమ్మలమడుగులోని నెమళ్ళదిన్నె గ్రామానికి చెందిన ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ ప్రముఖ దాతృత్వవేత్త జె. లక్ష్మిరెడ్డి గణేష్ విద్యార్థికి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహకంగా రు++20,000/ నగదు బహుమతిని అందజేసారు. నగదు బహుమతిని యర్రగుంట్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.త్రివిక్రమ్ రెడ్డి విద్యార్థికి అందజేసారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్యా కళాశాల కరెస్పాండెంట్ ఎస్.శ్రీకాంత్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ కె.ఓ.వి.రమణారావు మరియు కళాశాల డైరెక్టర్ ఎమ్. రామమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# దాహార్తిని తీరుస్తూ.. ప్రాణదాతలుగా నిలుస్తూ పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు





**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**

ప్రముఖ విద్యుత్ కాంట్రాక్టర్ పెద్దిరెడ్డి నరసారెడ్డి తమ భార్య లక్ష్మమ్మ జ్ఞాపకార్థం, మండుతున్న ఈ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం వారి సేవా గుణానికి నిదర్శనం. ప్రతి ఏటా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఎంతోమందికి ఉపశమనం కలిగిస్తున్నారు. కేవలం చలివేంద్రాలే కాకుండా, నరసారెడ్డి సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో మరియు ఆధ్యాత్మిక సేవల్లో చురుగ్గా పాల్గొంటూ సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటు కోవడం ఎంతో అభినందనీయమని శ్రీ కోదండ రామాలయం దేవస్థానం కమిటీ అధ్యక్షులు గోనుగుంట వెంకటసుబ్బారెడ్డి, బద్దెన కళా పీఠం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి ఆదూరి వీర ప్రతాపరెడ్డి తోపాటు పలువురు అన్నారు, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, వారి కుమారుడు డాక్టర్ గా వృత్తిపరంగా విశేషమైన వైద్య సేవలు అందిస్తూ పేదల పాలిట ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నారన్నారు, ఒకవైపు తండ్రి సమాజానికి అవసరమైన మౌలిక వసతులు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, మరోవైపు కుమారుడు డాక్టర్ గా ప్రాణరక్షణ బాధ్యతను చేపట్టడం ఆ కుటుంబం యొక్క విశిష్టత. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా వారి జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు, గురువారం ఎన్జీవో కాలనీ చలివేంద్రం ప్రారంభోత్సవం అనంతరం పలువురు బాధాచారులకు మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని జమ్మన వేణుగోపాల్ రెడ్డి కత్తెరపల్లి రాజశేఖర్ రెడ్డి, పాపుదిప్ప మల్లికార్జునరెడ్డి మాచుపల్లి రాజారెడ్డి, కనుపర్తి చెన్న కృష్ణారెడ్డి, లేపాకు రామకృష్ణారెడ్డి, ఎస్ ఎస్ సుబ్బరాయుడు, కల్లూరు సుధాకర్ రెడ్డి, మారం రెడ్డి చిన్న వెంకటసుబ్బారెడ్డి, అరవ రమేశ్ రెడ్డి తో పాటు పలువురు ఆయన సేవలను కొనియాడారు.

# ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి

నందు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో అక్కడి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిసింది. ఘర్షణలో గాయపడ్డ శ్రీనివాసులు మృతదేహం గురువారం రాత్రికి వచ్చే అవకాశం ఉంది. దీంతో గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు గాను ఖాజీపేట సిఐ వంశీధర్, ఎస్ఐ ధనుంజయుడు ఆధ్వర్యంలో సుమారు 40 మంది సిబ్బందితో బందోబస్తు, పికెటింగ్ ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ఉన్న దాసరి పల్లె గ్రామంలో కేవలం పొలం గట్టు విషయంపై ఘర్షణ జరిగే వ్యక్తి మరణించడంతో గ్రామంలో ప్రశాంతత కరువై కక్షలు పెరిగే అవకాశం ఉంది.

# కృషి, పట్టుదలకు మారుపేరు భగీరథుడు

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

కృషి, పట్టుదలకు మారుపేరని భగీరథుని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అనుకున్నది సాధించేంత వరకు నిద్రపోడని ఆయన వల్లనే ఈ రోజు భూమిపైకి నీరు ప్రవహిస్తోందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి అన్నారు. భగీరథుని జయంతిని పురస్కరించుకొని సగర కుల పెద్దలు తెదేపా కార్యాలయంలో గురువారం ప్రభుత్వం ఆధ్వర్యంలో అధికారికంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నేతృత్వంలో భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భగీరథుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వల్లనే నేడు రైతులు పంటలు పండించేందుకు తాగునీటిని వినియోగించుకుంటున్నామన్నారు. అనంతరం రాష్ట్ర సగర డైరెక్టర్ ప్రముఖ న్యాయవాది పేట చంద్ర మాట్లాడుతూ భగీరథుని వారసులుగా పుట్టడం మేము చేసుకున్న అదృష్టమన్నారు. సగర కులస్తుల అభివృద్ధి కోసం పాటుపడతామని వరదరెడ్డి సహాయ సహకారాలతో మా కులస్తులకు చేదోడు వాదోడుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మజారి వీర మోహన్, జోడు ప్రసాద్, పేట వెంకటరమణ, రాజువారి వెంకట సుబ్బయ్య, నశ్యం వెంకట సుబ్బయ్య, మజారి లక్ష్మినారాయణ, జానకీ సుబ్బారావు, సుబ్బరాయుడు, వెంకటేష్, జగతి జగన్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఆరాధన గురుపూజ మహోత్సవాలు

**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 23 ప్రభాతవార్త**

భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభం అయ్యాయని మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. ఉదయం నుంచి సుప్రభాత సేవ, అర్చనలు, శేష వాహనోత్సవం, రాత్రికి హరికథ కాలక్షేపం, నిర్వహించారు. 26న ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి సజీవ సమాధినిష్ట వహించిన పవిత్ర సుదినం సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకునేందుకు అన్ని రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో బ్రహ్మం గారి మాల దీక్ష పరులు, భక్తులు, అధిక సంఖ్యలో దర్శనానికి వస్తారని దర్శనానికి వచ్చే భక్తులకు క్యూ లైన్, లో మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేయాలని ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతి శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాములు వారు మేనేజర్ ఈశ్వరయ్య ఆచారికి ఆదేశించారు. సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లు, కళ్యాణ కట్ట, విశ్రాంతి భవనం పర్యవేక్షించారు. అలాగే పరిసర ప్రాంతాలని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.



